సంచలన దినపత్రిక
# హంస కలం వార్త
PRGI :T/TG/2026/0126/4786/1242

రిపోర్టర్లు కావలెను
హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో దిగ్విజయంగా నడపబడుచున్న హంస కలం పత్రికకు జిల్లాల వారిగా స్టాపర్‌లు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను (అనుభవం గల వారికి ప్రాధాన్యత)
సంప్రదించవలసిన సెల్ నెంబర్
9346255044
9966555449
హంస కలం వార్త
PRGI :T/TG/2026/0126/4786/1242

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక :20,చీఫ్ ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి,వెల రూ. 4/-, సోమవారం,తేది: 02-02-2026

## 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్
# ₹ 53.5 లక్షల కోట్లు

మూలధన వ్యయాన్ని రూ.12.2 లక్షల కోట్లకు పెంచిన కేంద్ర ప్రభుత్వం

బయోఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాలకు చెరో రూ.10,000 కోట్ల నిధులు

వ్యక్తిగత అవసరాల దిగుమతులపై కస్టమ్స్ సుంకం 10 శాతానికి తగ్గింపు

ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం 02



సామాన్యుడికి కొంత మోదం.. స్టాక్ మార్కెట్లకు, మదుపర్లకు ఖేదం.. స్టార్టప్‌లకు కాస్త నిరాశ.. పన్ను చెల్లింపుదారులకు అసంతృప్తి.. విదేశీ పెట్టుబడిదారులకు శుభవార్త.. తయారీరంగం వారికి ఊరట.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన బడ్జెట్ క్రికెట్ మ్యాచ్ చూశాక.. వివిధ వర్గాల అనుభూతులివి. 2026--27 సంవత్సరానికిగానూ రూ.53.47 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను నిర్మల ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నప్పటికీ, ప్రజాకర్షక హామీలకు దూరంగా బడ్జెట్‌ను రూపొందించారు. విత్త మంత్రి తన బడ్జెట్‌లో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అనేక చర్యలు ప్రకటించారు.



## కేంద్ర బడ్జెట్ ఎఫెక్ట్:
# ధరలు పెరిగేవి, తగ్గేవి 02

కొన్ని రకాల ఔషధాలు, ఈవీ బ్యాటరీలు, మొబైల్స్, ట్యాబ్లెట్స్ ధరల్లో తగ్గుదల

విదేశీ విద్య, వైద్యపరికరాలపై తగ్గనున్న భారం

పెరగనున్న సిగరెట్, లగ్జరీ వాచ్ లు, విదేశీ మద్యం ధరలు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన తొలి మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలిచారు. దేశీయ ఉత్పత్తులకు మద్దతు ఇచ్చేలా, దిగుమతులను నియంత్రించేలా, అదే సమయంలో డిమాండ్ పెంచేలా ఈ బడ్జెట్‌లో చర్యలు ప్రకటించారు. బడ్జెట్ ప్రభావంతో కొన్ని రకాల వస్తువుల ధరలు పెరగనుండగా, మరికొన్నింటి ధరలు తగ్గనున్నాయి.

## ఏప్రిల్ 1 నుంచి నూతన
# ఆదాయపు పన్ను చట్టం 02

ఆదాయపు పన్ను ఫారాలు సరళతరం చేసినట్లు వెల్లడి

విదేశీ యాత్రలు, విద్య, వైద్యంపై పన్ను, టీడీఎస్ తగ్గిస్తున్నట్లు తెలిపిన ఆర్థిక మంత్రి

విదేశీ ఆస్తుల వివరాలు వెల్లడించడం తప్పనిసరి అన్న నిర్మలా సీతారామన్




# ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ

కేసీఆర్ ను 4 గంటల 50 నిమిషాల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు

కేసీఆర్ వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డ్ చేసిన అధికారులు

నిందితుల వాంగ్మూలాల ఆధారంగా సాగిన దర్యాప్తు



హైదరాబాద్, ఫిబ్రవరి 1 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆదివారం నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), కేసీఆర్‌ను దాదాపు 4 గంటల 50 నిమిషాల పాటు విచారించింది. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని

మిగతా 2 లో

## కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా
# ₹ 33,180 కోట్లు

పెరిగిన పన్నులు రూ.3,281.01 కోట్లు

హైదరాబాద్ మీదుగా మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లు

సింగరేణికి రూ.2,500 కోట్లు కేటాయించిన కేంద్రం

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సంబంధించిన నిధుల కేటాయింపులు, పన్నుల వాటా వివరాలు వెల్లడయ్యాయి. కేంద్ర పన్నుల నుంచి రాష్ట్రానికి వచ్చే వాటాలో స్వల్ప పెరుగుదల కనిపించగా, మౌలిక వసతుల కల్పనలో భాగంగా హైదరాబాద్‌కు మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ప్రతిపాదించడం గమనార్హం. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాలకు పంచే వాటా కింద ఈసారి తెలంగాణకు 2.174 శాతం ఖరారైంది.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దీని ప్రకారం 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి మొత్తం రూ.33,180.78 కోట్లు రానున్నాయి. ఇందులో కార్పొరేషన్ పన్ను రూ.9,740.28 కోట్లు, ఆదాయపు పన్ను రూ.11,808.15 కోట్లు, కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) రూ.9,074.92 కోట్లు, కస్టమ్స్ సుంకం రూ.1,770.30 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.754.15 కోట్లు, ఇతర ట్యాక్స్‌లు రూ.32.98 కోట్లు ఉన్నాయి. కాగా గత బడ్జెట్‌లో కేంద్రం పన్నుల రూపంలో తెలంగాణకు

మిగతా 2 లో



# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: భట్టి

ఏం పాపం చేసిందని హైదరాబాద్‌ను పట్టించుకోలేదు?

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో కేంద్రానికి తెలంగాణ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ప్రపంచంతో పోటీ పడే స్థాయిలో అన్ని రంగాల్లో అనుకూలతలు కలిగి ఉన్న హైదరాబాద్ ఏం పాపం చేసిందని పట్టించుకోలేదని నిలదీశారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు ఉంటాయని ఆశించాం..కానీ నిర్మలా సీతారామన్

మిగతా 2 లో



# హైదరాబాద్ నుంచి హై స్పీడు రైల్ కారిడార్లు

ముంబైకి 3 గంటలు చెన్నైకి 3 గంటలు బెంగళూరుకు 2 గంటలు

హైదరాబాద్ నుంచి మూడో వంతుకుపైగా తగ్గనున్న ప్రయాణ సమయం

సాకారం కానున్న హైదరాబాద్ -ముంబై, చెన్నై, బెంగుళూరు కారిడార్లు

ఇప్పటికే డీపీఆర్ పూర్తి చేసుకున్న హైదరాబాద్ -ముంబై ప్రాజెక్టు రెండుగా విభజన 02





# కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా రూ.33,180 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

రూ.29,899.77 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. గతేడాదితో పోలిస్తే రాష్ట్రానికి వస్తున్న పన్నుల నిధులు రూ.3,281.01 కోట్లు అధికం. దేశవ్యాప్తంగా నగరాల మధ్య వేగవంతమైన ప్రయాణం కోసం కేంద్రం ప్రతిపాదించిన 7 హైస్పీడ్ రైల్వే కారిడార్లలో మూడు కారిడార్లు హైదరాబాద్‌ను అనుసంధానించనున్నాయి. ఇది రాష్ట్ర రవాణా రంగానికి ఊతమిచ్చే అంశం. ఈ కారిడార్లలో పుణే--హైదరాబాద్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నైలు ఉన్నాయి.

### పైలట్ ప్రాజెక్టుగా తెలంగాణ


కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల బదిలీలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన 'ఎస్ఎన్ఏ దేశవ్యాప్తంగా అమలు చేయడానికి ముందు.. కేవలం ఆరు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అందులో తెలంగాణ చోటు దక్కించుకుంది. జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రాలకు జరిగిన ఆదాయ నష్టాన్ని పూడ్చేందుకు, గతంలో కేంద్రం 'బ్యాక్ టు బ్యాక్ లోన్'పద్ధతిలో నిధులు విడుదల చేసింది. దీని కింద తెలంగాణకు 2020--21, 2021--22 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి మొత్తం రూ.6,949.49 కోట్లు విడుదలైనట్టు తాజా బడ్జెట్ పత్రాలు స్పష్టం చేశాయి.

### రాష్ట్రంలోని కేంద్ర సంస్థలకు కేటాయింపులు ఇవే

ఈ బడ్జెట్‌లో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజనలో భాగంగా తెలంగాణలోని బీబీనగర్ ఎయిమ్స్ సహా ఇతర ఎయిమ్స్‌లు అన్నింటికి కలిపి రూ.2,005 కోట్లు కేంద్రం కేటాయించింది. హైదరాబాద్ ఐఐటీ (ఎక్స్‌ట్రనల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు)కు నిధుల కేటాయింపులో మొండి చేయి చూపించారు. కాగా తెలంగాణలోని గిరిజన యూనివర్సిటీ కోసం కేటాయింపులు ప్రత్యేకంగా చేయలేదు.

### సింగరేణికి పెరిగిన నిధుల కేటాయింపు

సింగరేణి కేలరీస్ సంస్థకు రూ.2,500 కోట్లు, హైదరాబాద్‌లోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు రూ.405.97 కోట్లు, హైదరాబాద్ సహా దేశంలోని 7 నైపర్ సంస్థలకు కలిపి గత బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించి, రూ.281.07 కోట్లకు సవరించారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో నిధుల కోత విధించి రూ.215 కోట్లు ఏడు నైపర్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. కాగా హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్‌కు రూ.30 కోట్లు, హైదరాబాద్ సహా మరో మూడు ప్రాంతాల్లో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ హిందీ సంస్థకు రూ.26 కోట్లు, హైదరాబాద్ సహా 12 నగరాల్లో ఉన్న సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ--డాక్)కు రూ.280 కోట్లు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డుకు రూ.14.55 కోట్లు, స్వాతంత్ర్య సమరయోధులకు, నిజాం సంస్థాన విలీనం కోసం పోరాడిన యోధులకు (పెన్షన్లు) రూ.589.97 కోట్లు, హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమీ సహా పోలీసు విద్య, ట్రైనింగ్, పరిశోధనలకు కేటాయింపుల్లో కోత విధించి రూ.908.78 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు. అయితే హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌కు కేటాయింపుల్లో కోత విధించారు. మూడేళ్ల క్రితం రూ.115 కోట్లు కేటాయించి, రెండేళ్ల క్రితం బడ్జెట్‌లో కేవలం రూ.10.84 కోట్లు మాత్రమే కేటాయించిన కేంద్ర ప్రభుత్వం....గత బడ్జెట్‌లో కేవలం నామమాత్రంగా రూ.0.01 కోట్లు కేటాయించింది. కాగా ప్రస్తుత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) సహా దేశంలోని 25 స్వయంప్రతిపత్తి కేంద్రాలన్నింటికీ కలిపి రూ.1,643.87 కోట్లు, సీడీఎఫ్‌డీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనిమల్ బయోటెక్నాలజీ సహా దేశంలోని ఇతర స్వయంప్రతిపత్తి సంస్థలకు కలిపి రూ.1,002.13 కోట్లు, మణుగూరు సహా కోటా (రాజస్తాన్)లోని భార జల ప్లాంట్లకు రూ.1,745.52 కోట్లు కేటాయించారు.



# ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ

అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారం, వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు కేసీఆర్‌పై ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మొత్తం విచారణ ప్రక్రియను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. విచారణ పూర్తయిన తర్వాత సిట్ బృందం కేసీఆర్ నివాసం నుంచి వెనుదిరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే పలువురిని సిట్ విచారించింది. నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగానే మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారించినట్టు తెలుస్తోంది.

# 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూ.53.5 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యు-వశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. మొత్తం రూ.53.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

### ప్రధాన కేటాయింపులు, ఆర్థిక అంచనాలు

2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మొత్తం రాబడులు (అప్పులు మినహా) రూ.36.5 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర నికర పన్ను రాబడులు రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025-26 సవరించిన అంచనాల్లో ద్రవ్యలోటు 4.4 శాతంగా ఉంది. స్థూల మార్కెట్ రుణాలు రూ.17.2 లక్షల కోట్లుగా ఉంటాయని తెలిపారు.

### మౌలిక సదుపాయాలకు భారీ కేటాయింపులు

దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ప్రభుత్వ మూలధన వ్యయాన్ని (పబ్లిక్ క్యాపెక్స్) గత ఏడాది రూ.11.2 లక్షల కోట్ల నుంచి ఈసారి రూ.12.2 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ భారీ నిధులతో దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టులకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా పర్యావరణ అనుకూల ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు ఏడు హై-స్పీడ్ రైల్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-



బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. దీంతో పాటు తూర్పున డంకుని నుంచి పశ్చిమాన సూరత్ వరకు కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

### రంగాల వారీగా నిధుల కేటాయింపు

ఈ బడ్జెట్‌లో పలు కీలక రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

**బయోఫార్మా:** బయోఫార్మా రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యంతో 'బయోఫార్మా శక్తి' పథకాన్ని ప్రకటించారు. దీనికోసం రాబోయే ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయించారు.

**ఎంఎస్ఎంఈ:** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రూ.10,000 కోట్లతో 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**ఎలక్ట్రానిక్స్:** ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పథకం కోసం కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు.

**పరిశ్రమలు:** కంటైనర్ల తయారీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల కాలానికి రూ.10,000 కోట్లు కేటాయించారు.

**పర్యావరణం:** కార్బన్ క్యాప్చర్, యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) టెక్నాలజీల కోసం రాబోయే ఐదేళ్లలో రూ.20,000 కోట్లు కేటాయించారు.

**పట్టణాభివృద్ధి:** నగర ఆర్థిక ప్రాంతాల (సిటీ ఎకనామిక్ రీజియన్స్) అభివృద్ధి కోసం ఒక్కో ప్రాంతానికి ఐదేళ్లలో రూ.5,000 కోట్లు కేటాయించనున్నారు.

### పన్నులు, ఇతర ప్రతిపాదనలు

పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించేందుకు పలు సంస్కరణలు ప్రతిపాదించారు. ఏప్రిల్ 2026 నుంచి 'కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025' అమల్లోకి రానుంది. విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ రేటును 2 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 20% నుంచి 10%కి తగ్గించడం ద్వారా సామాన్యులకు ఊరట కల్పించారు. క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 17 రకాల మందులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. మరోవైపు, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ని 0.02% నుంచి 0.05%కి పెంచారు. మొత్తం మీద ఈ బడ్జెట్, దీర్ఘకాలిక వృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా మౌలిక వసతులు, తయారీ రంగాలపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

# ధరలు పెరిగేవి.. తగ్గేవి

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని రకాల మెడిసిన్ ధరలు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, మొబైల్స్, ట్యాబ్లెట్స్, తోలు, వస్త్ర పరిశ్రమ ఉత్పత్తుల ధరలు తగ్గే అవకాశం ఉంది. క్యాన్సర్, డయాబెటిస్ సహా 17 రకాల ఔషధాల ధరలు తగ్గనున్నాయి. విదేశీ విద్య, వైద్య పరికరాలు, టూర్ ప్యాకేజీలపై పన్ను తగ్గింపు నేపథ్యంలో ఖర్చులో కాస్త ఊరట దక్కనుంది. సముద్ర ఆహార ప్రాసెసింగ్ ఇన్‌పుట్‌లకు సుంకం లేని దిగుమతిని ప్రస్తుత పరిమితిని మూడు రెట్లు పెంచారు. మైక్రోవోవెన్ల తయారీలో ఉపయోగించే నిర్దిష్ట భాగాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయిస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీంతో ఈ ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. ఈవీ బ్యాటరీలు, సోలార్ ప్యానల్స్ ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది. ఆల్కాహాల్, సిగరెట్, పాన్ మసాలా వంటి హానికర ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. వీటిపై అధిక ఎక్సైజ్ సుంకం విధించాలని కేంద్రం నిర్ణయించింది. వ్యక్తిగతంగా దిగుమతి చేసుకున్న కొన్ని ఉత్పత్తులపై విధించే సుంకం పెంచుతున్న నేపథ్యంలో వాటి ధరలు పెరగనున్నాయి. లగ్జరీ వాచ్ లు, విదేశీ మద్యం ధరలు పెరగనున్నాయి.

# హైదరాబాద్ నుంచి హై స్పీడు రైల్ కారిడార్లు

**హైదరాబాద్:** దేశ రైల్వే చరిత్రలోనే ఇదో ముందడుగు. ప్రస్తుతం ముంబై--అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులు పూర్తికావస్తున్న దశలో, ఒకేసారి ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను పట్టాలెక్కించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో మూడు హైదరాబాద్‌తో అనుసంధానమవడం విశేషం. బుల్లెట్ రైలు ప్రాజెక్టు తరహాలోనే వీటి నిర్మాణం ఉండనుంది. హైదరాబాద్--పుణె, హైదరాబాద్--చెన్నై, హైదరాబాద్--బెంగుళూరు మధ్య ఎలివేటెడ్ పద్ధతిలో ఇవి రూపొందనున్నాయి. ఒక్కో ప్రాజెక్టు దాదాపు రూ.లక్షన్నర కోట్ల భారీ వ్యయంతో రూపొందనున్నాయి. ఇవి పూర్తయితే, ప్రస్తుతం రైలు మార్గంలో ఆ మూడు నగరాలకు అవుతున్న ప్రయాణ సమయం మూడో వంతుకుపైగా తగ్గిపోనుంది. ప్రస్తుతం 13 గంటల చెన్నై ప్రయాణ సమయం మూడు గంటలకు, బెంగుళూరుకు 9 గంటలకు బదులు రెండు గంటల్లో, పుణెకు ఎనిమిది గంటలకు బదులు రెండు గంటలలోపు సమయంలోనే చేరుకోవచ్చు. ఇది రైలు రవాణాలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతుంది.



### 'హైదరాబాద్--ముంబై'రెండు భాగాలుగా...

హైదరాబాద్--ముంబై మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్‌కు గతంలోనే రైల్వే శాఖ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే దానికి సంబంధించిన డీపీఆర్ కూడా పూర్తయింది. ఇప్పుడు దాన్ని రెండు భాగాలు చేసి, రెండు కారిడార్లుగా నిర్మించనున్నారు. ఆదివారం కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో రెండు ఇవే. గతంలో హైదరాబాద్--ముంబై హైస్పీడ్ రైల్ కారిడార్‌గా ఉన్న ప్రాజెక్టును ఇప్పుడు హైదరాబాద్--పుణె, పుణె--ముంబైగా మార్చారు. ' హైదరాబాద్--పుణె--ముంబై కారిడార్ నిర్మాణానికి గతంలోనే రంగం సిద్ధమైంది. 760 కి.మీ.నిడివితో ఉండే ఈ ప్రాజెక్టు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉంది. ' 2020 మార్చిలో ట్రాఫిక్ డిమాండ్ ఫోర్‌కాస్టింగ్, ప్రిలిమినరీ ఇంజినీరింగ్ సర్వేలు, జియోటెక్నికల్ అసెస్‌మెంట్‌లు నిర్వహించారు. మార్గం, మ్యాపింగ్, మట్టి పరీక్షలు, ఎలివేటెడ్/అండర్‌గ్రౌండ్ సెక్షన్ల అంచనా వ్యయాన్ని ప్రాథమికంగా రూపొందించారు. 2020 చివరి నుంచి 2021లో హైవే ఇంజినీరింగ్ మాగ్నటూడ్ కన్సార్టియం, ట్రాన్స్‌లింక్ కన్సల్టెంట్స్ కాంట్రాక్టర్లు జనరల్ అలైన్‌మెంట్ డ్రాయింగ్స్, యుటిలిటీ సర్వే (ఓవర్‌హెడ్, అండర్‌గ్రౌండ్ యుటిలిటీలు), పవర్ సోర్సింగ్ ఆప్షన్లు గుర్తించారు. ఈ కారిడార్‌కు ప్రయాణికుల డిమాండ్ అంచనాలు, పర్యావరణ ప్రభావ అంచనాలు కూడా రూపొందించారు. ఇప్పటికే డీపీఆర్‌ను కూడా రూపొందించి రైల్వే బోర్డుకు అందజేశారు. అది బోర్డు పరిశీలనలో ఉంది. ' మహారాష్ట్ర, తెలంగాణలో 250--300 గ్రామాలు ప్రభావితమవుతాయని అంచనాకొచ్చారు. లైడార్ సర్వే కూడా చేశారు. ప్రస్తుతం ముంబైకి హైదరాబాద్ నుంచి రైలు మార్గంలో 14 గంటల సమయం అవుతుండగా, హైస్పీడ్ రైలు ద్వారా కేవలం మూడు గంటల్లోనే గమ్యం చేరుకునే వీలుంటుంది. ఈ రైలు 350 కి.మీ.గరిష్ట వేగ సామర్థ్యం ఉంటుండగా, ఆపరేషనల్ స్పీడ్ 320 కి.మీ.గా ఉంటుందని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. ఇది స్టాండర్డ్ గేజ్ (1,435 మి.మీ.), 25 కేవీ ఏసీ ఓవర్‌హెడ్ ట్రాక్షన్‌తో ఉంటుంది. ఎలివేటెడ్, అండర్‌గ్రౌండ్‌తో కలిపి కారిడార్ ఉంటుంది. ఈ రైల్లో 750 మంది వరకు ప్రయాణికులు వెళ్లే వీలుంటుంది. ' ప్రతిపాదిత స్టేషన్లు (మొత్తం 11) ఇలా: హైదరాబాద్, జహీరాబాద్, కలబురిగి, సోలాపూర్, పండరీపూర్, అక్లోజ్, దౌండ్, పుణె, లోనావాలా, నవీ ముంబై, కుర్లా కాంప్లెక్స్, బాంద్రా, ముంబై.

### మూడు గంటల్లో చెన్నై...

హైదరాబాద్--చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదన రెండేళ్లుగా ఉంది. గతేడాది ఓ అలైన్‌మెంటును రూపొందించిన రైల్వే శాఖ తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. రైట్స్ లిమిటెడ్ ఫైనల్ అలైన్‌మెంట్ సర్వే ట్రాఫిక్ పొటెన్షియల్ అనాలిసిస్ నిర్వహించింది. తమిళనాడు అభ్యర్థన మేరకు అలైన్‌మెంట్‌ను సవరించి, తిరుపతి స్టేషన్‌ను చేర్చారు. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆర్వీ అసోసియేట్స్, జీఎస్ఎల్ అసోసియేట్స్‌లకు అలైన్‌మెంట్ డిజైన్, లైడార్ సర్వే కాంట్రాక్టులు ఇచ్చారు. ప్రాథమిక డీపీఆర్‌ను రూపొందించగా, తుది డీపీఆర్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. రెండు నగరాల మధ్య 710 కి.మీ. దూరం ఉండగా, 12--14 గంటల ప్రయాణ సమయం పడుతోంది. హైస్పీడ్ రైల్లో ఆ దూరాన్ని కేవలం 3 గంటల్లోనే చేరుకోవచ్చని అంచనా. ' హైదరాబాద్--బెంగళూరు కారిడార్‌ను కూడా గతేడాది ప్రతిపాదించారు. 2025 సర్వే కసరత్తు ప్రారంభించారు. రెండు నగరాల మధ్య 626 కి.మీ. దూరం ఉండగా, ప్రస్తుతం రైళ్లు 8 గంటలను మించి సమయం తీసుకుంటున్నాయి. ఇప్పుడు ఆ దూరాన్ని రెండు గంటల్లోనే చేరుకోవచ్చు. ఎలివేటెడ్ పద్ధతిలో హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి రూ.1.2 లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా.

# ఏప్రిల్ 1 నుంచి నూతన ఆదాయపు పన్ను చట్టం

**న్యూఢిల్లీ:** రానున్న ఏప్రిల్ 1వ తేదీ నుంచి నూతన ఆదాయ పన్ను చట్టం అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆమె లోక్‌సభలో ప్రసంగిస్తూ, సామాన్యులు కూడా ఫైల్ చేసేలా ఆదాయపు పన్ను చట్టంలో మార్పులు చేసినట్లు చెప్పారు. సరళతరం చేసిన ఫారాలు త్వరలో అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు. సవరించిన పన్ను రిటర్నుల దాఖలు గడువును పెంచుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 31తో గడువు ముగిసిందని, దీనిని మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. విదేశీ యాత్రలపై పన్ను తగ్గిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే విదేశీ విద్య, వైద్యంపై టీడీఎస్ 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించనున్నట్లు తెలిపారు. మానవ వనరుల సరఫరా సంస్థలపై కూడా టీడీఎస్ తగ్గించనున్నట్లు తెలిపారు. ఈ ఏజెన్సీలపై 1 లేదా 2 శాతం టీడీఎస్ వర్తిస్తుందని అన్నారు. రహదారి ప్రమాదాల పరిహారం వడ్డీపై పన్నును తొలగిస్తున్నామని అన్నారు. చిన్న మొత్తంలో పన్ను చెల్లింపులు జరిపే వారికి కూడా ప్రత్యేక పథకం తీసుకు వస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి విదేశీ ఆస్తుల వివరాలు వెల్లడించడం తప్పనిసరి అని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం సందర్భంగా స్పష్టం చేశారు. అదే సమయంలో కంపెనీల బైబ్యాక్ విధానాలకు కేంద్ర ఆర్థిక మంత్రి షాకిచ్చారు. కార్పొరేట్ బైబ్యాక్ కొనుగోళ్లపై 2 శాతం పన్ను విధించనున్నట్లు తెలిపారు. నాన్-కార్పొరేట్ బైబ్యాక్ కొనుగోళ్లపై 30 శాతం పన్ను విధిస్తున్నట్లు తెలిపారు. పన్ను వివాదాల్లో క్రిమినల్ చర్యల తీవ్రతను తగ్గిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇలాంటి వివాదాల్లో జైలు శిక్షను రెండేళ్లకు తగ్గిస్తున్నట్లు ప్రకటించిన ఆర్థిక మంత్రి, జరిమానా చెల్లిస్తే కనుక ఆ జైలు శిక్ష నుంచి కూడా మినహాయింపు ఉండనుందని ప్రకటించారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన బడ్జెట్ తమను నిరాశ పర్చిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తాను, సీఎం రేవంత్, సహచర మంత్రులు, ఎంపీలు పలు దఫాల్లో బృందాలుగా వెళ్లి దేశ ప్రధాని, ఆర్థిక మంత్రిని కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ ప్రపంచానికి ఫార్మా రాజధాని వంటిది. కోవిడ్ సమయంలో ప్రధాని మోదీ స్వయంగా వచ్చి ప్రశంసించిన భారత్ బయోటెక్ ఈ మట్టిలోనే ఉంది. కానీ బయో ఫార్మా కేటాయింపుల్లో తెలంగాణ పేరు లేకపోవడం విడ్డూరం. ఎలక్ట్రానిక్స్ రంగానికి రూ.40 వేల కోట్లు కేటాయించి, ఈసీఐఎల్ వంటి దిగ్గజ సంస్థలున్న హైదరాబాద్‌కు ఒక్క పైసా ఇవ్వకపోవడం నిరాశ పరిచింది. హైదరాబాద్ అంటే ఎలక్ట్రానిక్స్. ఎలక్ట్రానిక్స్ అంటే హైదరాబాద్ అన్న నానుడిని కేంద్రం చెరిపివేసే ప్రయత్నం చేస్తోంది. భవిష్యత్ తరాలకు అత్యంత కీలకమైన ఆరెంజ్ ఎకానమీ (ఆడియో, వీడియో, గేమింగ్, కామిక్స్) రంగంలో హైదరాబాద్ ప్రపంచస్థాయి సామర్థ్యాన్ని కలిగి ఉంది. కానీ కేంద్రం ఉద్దేశపూర్వకంగా ముంబైకి మళ్లించింది. మెడికల్ టూరిజంలో దేశానికే తలమానికంగా ఉన్న తెలంగాణను విస్మరించి, ఇతర రాష్ట్రాలకు రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌లు ఇవ్వడం ఏ చట్టం కిందకు వస్తుంది. ఇలా అన్ని రంగాల్లో హైదరాబాద్‌ను పట్టించుకోకుండానే బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టారు'అని వ్యాఖ్యానించారు.

### భారీ నిధులు వస్తాయని ఆశించాం

హైదరాబాద్ నగరాభివృద్ధికి కీలకమైన మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ వంటి ప్రాజెక్టులకు భారీగా నిధులు ఆశించాం..కానీ ఒక్క ప్రాజెక్టుకు కూడా కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని భట్టి అన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రధానిని కలిసినా ఫలితం లేకపోయిందని చెప్పారు. రామప్ప దేవాలయం, మన్ననూరు, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లు, చారిత్రక ఆలయాలతో టూరిజం కేంద్రంగా ఉన్న తెలంగాణకు టూరిజం ప్యాకేజీలో కేంద్రం స్థానం కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా గ్రామీణ పేదల బతుకుతెరువును దెబ్బతీస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమంపై బడ్జెట్ మౌనాన్ని వహించడం సామాజిక న్యాయానికి విరుద్ధమన్నారు. కేంద్రానికి ఒక నీతి, రాష్ట్రానికి ఒక నీతా అని భట్టి ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు పార్టీలు, రాజకీయాలకతీతంగా బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

డైలీ న్యూస్ పేపర్ హంస కలం

సోమవారం 02-02-2026

## జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో మగ్దూం నగర్ లో





**ఫిబ్రవరి 01 హంస కలం:** శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలలో పాల్గొన్న కొలుకుల జైహింద్ అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ స్వామివారి కృప కటాక్షాలతో జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో. ఆలయ కమిటీ అధ్యక్షులు. సుజిత్ కుమార్. వైస్ ప్రెసిడెంట్. రాజు. కమిటీ సభ్యులు. రాములు భాస్కర్ దినేష్ విటల్ కిషన్ నాగేష్. విట్టల్ గౌడ్ . సాయిలు యాదవ్.రాజు తదితరులు పాల్గొన్నారు

## ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కార్మికులు, రైతులు, కూలీలు దేశమంతట పోరుబాట...

మోడీ ప్రభుత్వం తన విదానాలు మార్చుకోవాలి..

జె మల్లికార్జున్ పిలుపు..

సినర్జీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది.





**ఫిబ్రవరి 01 హంస కలం:** ఈ సందర్భంగా సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కూలి, ప్రజ, రైతంగ వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, కార్మికులు రైతులు కూలీలు దేశమంతటా పోరుబాట పట్టారని, మోడీ ప్రభుత్వం తన ఆర్థిక విదానాలను మార్చుకోవాలని ఆయన అన్నారు, లేకపోతే దేశంలో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు రాక తప్పవని అన్నారు. ఫిబ్రవరి 12 న జరిగే సమ్మె దేశభక్తి సమ్మె అని ఆయన అన్నారు, ప్రజల కోసం జరుగుతున్న సమ్మె అని ఆయన అన్నారు, అందుకే ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమ్మె వివిధ కేంద్ర కార్మిక సంఘాలు మరియు వివిధ ఫెడరేషన్లు, ఇన్సూరెన్స్, బ్యాంకు, ఎంప్లాయిస్ సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున సమ్మె జరగనున్నదని ఆయన అన్నారు, కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం తక్షణమే లేబర్ కోడులను రద్దు చేయాలని, అలాగే ఉపాధి హామీ పథకం లో తెచ్చిన మార్పులను ఉపసంహరించుకోవాలని, విత్తన బిల్లును రద్దు చేయాలని, ఇన్సూరెన్స్ రంగంలో 100% ఖీణ× రద్దు చేయాలని డిమాండ్ చేశారు, సమ్మె సందర్భంగా కార్మికులు వివిధ రూపాల పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని, సమ్మె రోజు పెద్ద ఎత్తున కార్మికు పాల్గొనని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే రాజయ్య, మాణిక్యం, శాంత కుమార్, హరినాథ్, యాదగిరి, కృష్టారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట్ బిజెపి కార్పొరేటర్ మరియు కార్యకర్తలు

ముస్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష





**ఫిబ్రవరి 01 హంస కలం:** మూసాపేట్ ఆంజనేయ నగర్, రోడ్ నెంబర్--9 లో ఉన్న పార్కు స్థలాన్ని కాపాడుతూ కాలనీ ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేయాలని కోరుతూ ఆంజనేయ నగర్ సభ్యులు మహేందర్, లోకేష్ ఆధ్వర్యంలో నిన్న ఉదయం నుంచి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని, దీక్ష చేస్తున్న ఆంజనేయ నగర్ కాలనీ వాసులకు సంఘీభావం తెలుపుతూ స్వయంగా దీక్షలో కూర్చున్నారు.అనంతరం సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి పార్కు స్థల ప్రాధాన్యతను, కాలనీ ప్రజల అవసరాలను వివరించి సమస్యను పరిష్కరించే దిశగా గట్టి ప్రయత్నం చేశారు. స్పందించిన అధికారులు పార్కు అభివృద్ధి పనులు త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల హామీ నేపథ్యంలో దీక్ష చేపట్టిన మహేందర్, లోకేష్ తో పాటు ఇతర కాలనీ సభ్యులు పరస్పర చర్చల అనంతరం రాజేశ్వరరావు మహేందర్ మరియు లోకేష్ కు కొబ్బరి నీళ్లను అందించి నిరాహార దీక్షను విరమింపచేశారు. ప్రజల కోసం పార్కు అభివృద్ధి జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని రాజేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, మూసాపేట్ మరియు బాలాజీ నగర్ డివిజన్ బిజెపి నాయకులు అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు,డాకయ్య, మల్లేష్ గౌడ్, జీవన్, శేఖర్ గుప్తా, వినోద్ గౌడ్,ఇ.సాయి,పిట్ల మనోహర్,పండుగ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం





**ఫిబ్రవరి 01 హంస కలం:** చేపట్టిన, చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పట్ల ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. టిఆర్ఎస్ నాయకుడు మోటేపల్లి రంగమ్మోహన ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభలో సుమారు 200 మంది కార్యకర్తలు బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు .ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తే పదవులు వాటి అంతటవే వస్తాయి అన్నారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుంటే కాంగ్రెస్ లోకి జరుగుతున్న ఈ వలసలు శుభ పరిణామం అన్నారు. ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. అంతకుముందు రంగమోహన్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి ప్రభుత్వ కళాశాల నుంచి కెపిహెచ్బి బస్టాండ్ వరకు పార్టీ కార్యకర్తలతో పెద్ద ఎత్తున ద్విచక్ర ర్యాలీ నిర్వహించారు .బాణాసంచా కాల్చారు కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ రేవంత్ రెడ్డి జిందాబాద్ బండి రమేష్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై రాస్తారోకో చేసిన బిఆర్ఎస్ నాయకులు





**ఫిబ్రవరి 01 హంస కలం:** తెలంగాణా హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద గౌడ్ , ఎం.ఎల్.సి శంభీపూర్ రాజు మరియు శంభీపూర్ కృష్ణ అన్న సూచనలమేరకు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దుండిగల్ మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులందరం కలిసి ఈ ధర్నా నిర్వహించాం. తెలంగాణ ఉద్యమ నాయకుడు, మలిదశ ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ( కెసిఆర్) ని లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ అంశంలో జరుగుతున్న ా× విచారణ పూర్తిగా రాజకీయ ప్రతీకార చర్యగా మేము భావిస్తున్నాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలనపై దృష్టి పెట్టకుండా, ప్రతిపక్ష నేతలను వేధించే కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం. ఒక మాజీ ముఖ్యమంత్రిపై విచారణ పేరుతో రాజకీయ కక్ష సాధింపులు చేయడం సరికాదు. న్యాయం అంటే ఎంపికచేసి విచారించడం కాదు --- అందరికీ సమానంగా వర్తించాలి. రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు, యువత నిరుద్యోగంతో బాధపడుతోంది, అభివృద్ధి నిలిచిపోయింది. ఈ అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పకుండా, దృష్టి మళ్లించేందుకు రాజకీయ డ్రామాలు ఆడుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రతీకార సాధనంగా మార్చితే ప్రజలు మౌనంగా ఉండరు. రాజ్యాంగ విలువలు, న్యాయం, పారదర్శకత పాటించకపోతే మా పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తాం. ఈ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నాం.. ఈ కార్యక్రమంలో... జుఇ. దుండిగల్ మునిసిపల్ చైర్మన్ తుడుము పద్మారావు, జుఇ. కౌన్సిలర్స్ అమరం గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎలుగారి సత్తి, మురళి యాదవ్, నర్సింగం భరత్, విష్ణువర్ధన్ రెడ్డి, శంకర్ నాయక్, శ్రీనివాస్ యాదవ్, మల్లేష్ మరియు బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ దారా, ధర్మారెడ్డి, ప్రవీణ్ నాయక్, విష్ణు యాదవ్ పలువురు పాల్గొన్నారు.

## బికేసీఆర్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో ప్రభుత్వంలోకి రావడం ఖాయం

కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం ఖాయం : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**ఫిబ్రవరి 01 హంస కలం:** రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మా పార్టీ నాయకులపై విచారణలు చేయడం తప్పా ప్రభుత్వం చేసింది ఏమి లేదు... చట్ట విరుద్ధంగా పసలేని కేసులతో విచారణపేరుతో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ని ఇబ్బంది పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యలను ఎండగడుతూ తెలంగాణ భవన్ వేదికగా విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వ పాలన, కక్ష సాధింపు చర్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి మా అధినాయకుడు కేసీఆర్ ని, మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని, మా నాయకులు హరీష్ రావు ని ఇబ్బందులకు గురి చేస్తూ కక్ష సాధింపుతో ఇబ్బందులకు చేయాలని చూడడమే తప్పా చేసింది ఏమీ లేదు. కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని నిదర్శనంగానే చట్ట విరుద్ధంగా మా అధినాయకులు కెసిఆర్ కి నోటీసులు ఇచ్చి ప్రశ్నించడమే నిదర్శనం. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ను ఏర్పాటు చేసిందే కేసీఆర్ ని, మా పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టడానికే. ప్రభుత్వం ఏర్పడి మూడు రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని, మూడు సంవత్సరాలు కావస్తున్న ఇంకా ఫోన్ ట్యాపింగ్ కేసు ఏందిరా నాయనా అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారంలో వచ్చిన వంద రోజుల్లో అమలుచేస్తామన్న ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమైనాయి అని ప్రజలు అడుగుతా ఉన్నరు. మీరిస్తామన్న సంవత్సరం లోపు రెండు లక్షల ఉద్యోగాలు ఏమైనాయి అని అడుగుతా ఉన్నారు. ఈ విధంగా ప్రజలు ప్రశ్నిస్తున్నారని ప్రజల దృష్టిని మళ్లించేందుకు "డైవర్షన్ పాలిటిక్స్" ను చేస్తూ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుంది. ఈరోజు మా నాయకులను అప్రజాస్వామికంగా నిర్బంధం చేస్తూ నిర్బంధ కాండపు



పాల్పడుతుంది ఈ ప్రభుత్వం. కెసిఆర్ కి ప్రజలు నీరాజనాలు పలుకుతా ఉంటే ఎక్కడికక్కడ వారిని నిర్బంధిస్తూ నిర్బంధ కాండకు పాల్పడుతుంది ఈ ప్రభుత్వం. చట్టంలో 65 ఏళ్ల పైబడిన ఎవరినైనా వారి ఇంట్లోనే విచారించవచ్చనీ హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నా ప్రభుత్వం వాటిని ఉల్లంఘిస్తూ అన్యాయంగా మా పార్టీ ఇబ్బందులకు గురిచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అడిస్తున్నట్టు సిట్ అధికారులు ఆడుతూ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగా మారింది పోలీసు వ్యవస్థ అని ఆరోపణలు చేస్తా ఉన్నాను. మీరు మీ హద్దు దాటి, చట్టవిరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతిలో కీలు బొమ్మలుగా మారి రాత్రి వేళ్లలో నోటీసులు ఇచ్చే విధంగా ఎందుకు వ్యవహరిస్తా ఉన్నారు. అది కూడా ఇప్పుడు ముఖ్యమంత్రి ఇక్కడ లేరు, ముఖ్యమంత్రి చదువుకొనే సమయంలో చదువుకోకుండా ఇప్పుడు ఈ వయసులో చదువుకుంటున్నారు. ఆయనకు చదువు కంటే ఎక్కువ సంస్కారం అవసరం. ముఖ్యమంత్రి డైరెక్షన్లోనే సిట్ నాటకాలు ఆడుతా ఉన్నది. అక్కడ తెల్లారినంక, ఇక్కడ రాత్రి అయినంక అది ఇంట్లో ఎవరులేని సమయంలో వచ్చి అంటిస్తా నోటీసు గోడకు అంటిస్తా ఉన్నారు. ఇది పోలీసు వారు చేస్తున్న దుశ్చర్య. ప్రభుత్వం ఆహంకారపూరితంగా వ్యవహరిస్తా ఉన్నది. ప్రభుత్వానికి తోడుగా పోలీస్ వ్యవస్థ పని చేస్తా ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైనది. వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడతా ఉన్నది. మున్సిపల్ ఎలక్షన్స్ నడుస్తా ఉంటే మమ్మల్ని ఇబ్బందుల గురిచేస్తూ ప్రజా క్షేత్రంలో తిరగకుండా ఉంచాలనే ఆలోచనతో వ్యవహరిస్తా ఉన్నది. ఈ చర్యలన్నీ ముఖ్యమంత్రి సంకుచిత మనస్తత్వానికి దర్పణం పడుతా ఉన్నయి. రాజకీయాలు ఎప్పుడూ హుందా తనంగా చేయాలి గాని, సంకుచిత మనస్తత్వంతో కాదు. ప్రభుత్వ పాలన అనేది ఈ విధంగా అరాచకాలు, నిర్బంధాలతో చేస్తామంటే రాబోయే రోజుల్లో ప్రజల్లో గుణపాఠం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తా ఉన్నాను. పోలీసులు కూడా చట్టానికి లోబడి పనిచేస్తేనే మంచిది. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. అధికారం అనేది వస్తా ఉంటది, పోతా ఉంటది, మారుతా ఉంటది. భవిష్యత్తులో వీటన్నింటిపై పోలీస్ వారు సమాధానం చెప్పాల్సి ఉంటదని మనవి చేస్తా ఉన్నను. ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంలోని సోషియో ఎకానమీ ఫోరం కూడా చెప్పింది. మేడిగడ్డను వెంటనే మరమ్మత్తులు చేయండి, కాళేశ్వరం ద్వారా తెలంగాణ సస్యశ్యామలం అయ్యిందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ద్వంద వైఖరిని మానుకోవాలి, పోలీస్ శాఖ ద్వంద వైఖరిని మానుకోవాలి. ప్రజలను తప్పుదోవ పట్టించే డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలి. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలు లేవు, పసలేదు. బురద చల్లడంలో భాగంగానే ఈ నాటకాలు. గత రెండేళ్ల కాలంలో కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్, ఫోన్ ట్యాపింగ్ పై సిట్, ఫార్ములా ఈ పై ఏసీబీ కేసు, గొర్రెల పంపిణీపై విచారణ, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ, ధరణి పై విచారణ, ఔటర్ రింగ్ రోడ్ పై విచారణ, బతుకమ్మ చీరలపై విచారణల పేర్లతో వీళ్లు ఎంక్వైరీ లు చేయడాన్ని ప్రజలు గమనిస్తా ఉన్నరు. అరిగిపోయిన పాట రికార్డ్ పాటలా ఎన్ని రోజులు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసురా నాయనా అంటూ ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తా ఉన్నారు.మీ వైఫల్యాలను, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రజల్లోనే ఎండగడతాం. ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాం. కేసీఆర్ మా నాయకులు. నాయకులే కాదు, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణ త్యాగానికి సైతం సిద్ధపడ్డ మహానేత. వారికి తెలంగాణలోని ప్రతీ ఒక్కరు నేడు సంఘీభావం తెలుపుతా ఉన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రానున్న మూడేళ్లలో ప్రభుత్వంలోకి రావడం ఖాయం . ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం ఖాయం.

## గొల్ల కురుమ సంఘం. నూతన కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు,



**ఫిబ్రవరి 01 హంస కలం:** కూకట్ పల్లి గొల్ల కురుమ సంఘం 2026 సంవత్సరం ఫిబ్రవరి ఒకటో తేదీ రోజున సంఘం సభ్యులందరూ సమావేశం ఏర్పాటు చేసుకొని నూతనంగా కూకట్ పల్లి గొల్ల కురుమ సంఘం ప్రెసిడెంట్ ని అంకెనపల్లి రాజులు .. జనరల్ సెక్రటరీగా గుర్రంపల్లి మహేందర్ యాదవ్ ని. సమావేశంలో పాల్గొన్న కుల సభ్యులందరి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది... ప్రెసిడెంట్ జనరల్ సెక్రెటరీ కలిసి నూతన కమిటీ ఏర్పాటు చేసుకోవాల్సిందిగా అన్ని ఆలయాలను కలిపి... అందర్నీ కలుపుకొని నూతన కమిటీ ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఏకగ్రీవంగా అందరు కుల సభ్యులు నిర్ణయం చేసుకున్నారు

## భరత్ నగర్ కాలనీలో 'మా దారి మా హక్కు' ధర్నా

రాకపోకల మార్గాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్



కూకట్ పల్లి, (మూసాపేట డివిజన్) **ఫిబ్రవరి 01 హంస కలం:** భరత్ నగర్ కాలనీ నుంచి ప్రధాన రహదారికి ఉన్న రాకపోకల మార్గాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ కాలనీవాసులు 'మా దారి -- మా హక్కు' నినాదంతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నికైన భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించారు. భరత్ నగర్ కాలనీ నుంచి మెయిన్ రోడ్డుకు ఉన్న రాకపోకల మార్గాన్ని 2017 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మరియు అధికారులు నియంత్రించడంతో, అప్పటి నుంచి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం ఎలా రాకపోకలు కొనసాగాయో అదే విధంగా, ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాలనీ రోడ్డులో వాహనాలు, ప్రజలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను అధికారులు త్వరితగతిన పరిష్కరించకపోతే, భవిష్యత్ కార్యాచరణను ఉధృతం చేసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని నాగిరెడ్డి హెచ్చరించారు. బి బ్లాక్ అధ్యక్షులు తోము వేణు ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు తెలిపారు ఈ ధర్నా కార్యక్రమంలో తూము సంతోష్, బి. నాగేశ్వరరావు, బాబు, నరేష్, తూము వేణు, వెంకటేష్ యాదవ్, తూము సంతోష్, రాంబాబు, రత్నారావు, బుచ్చిబాబు, సూర్యనారాయణమూర్తి, రామ్మోహన్ యాదవ్తో పాటు మూసాపేట డివిజన్లోని అన్ని అనుబంధ బస్తీల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మారుతితో ప్రభాస్ మరో సినిమా..

### క్లారిటీ ఇచ్చిన టీమ్

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన చిత్రం 'ది రాజాసాబ్'. ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఫలితాన్ని అందుకోకపోవడంతో ప్రభాస్ ఆయన దర్శకత్వంలో మరో ప్రాజెక్ట్ చేయనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. భారీ స్థాయిలో హోంబలే ఫిల్మ్స్ దీన్ని నిర్మించనున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అవి రూమర్స్ మాత్రమేనని స్పష్టం చేసింది.

# శ్రీవారిని దర్శించుకున్న అనిల్ రావిపూడి

### తదుపరి చిత్రం వివరాలు త్వరలోనే వెల్లడిస్తా

టాలీవుడ్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం పట్ల కృతజ్ఞతగా స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడానికి ఆయన తిరుమల వచ్చారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన అనిల్ రావిపూడి తన తదుపరి ప్రాజెక్ట్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన నెక్ట్స్ మూవీపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, మరో 10 నుంచి 15 రోజుల్లో అధికారికంగా అప్‌డేట్ ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. ఫిల్మ్ నగర్ సమాచారం ప్రకారం, అనిల్ తన తదుపరి చిత్రాన్ని విక్టరీ వెంకటేష్‌తో చేసే అవకాశం ఉంది. ఇది ఒక భారీ మల్టీస్టారర్ అని, ఇందులో తమిళ స్టార్ కార్తీ లేదా మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ నటించే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా ఎంట్టంల్గ÷న్మెంట్ చిత్రాలే అందించిన అనిల్, ఈసారి పూర్తిగా కొత్త జానర్‌లో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ వేగంగా జరుగుతోంది.





## భగవంతుడి మూవీలో ఫరియా డిఫరెంట్ రోల్

'జాతిరత్నాలు'తో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఫరియా అబ్దుల్లా పేరు చెబితే ఇప్పటికీ చాలామందికి చిట్టి పాత్రే గుర్తొస్తుంది. ఆ సినిమాతో వచ్చిన క్రేజ్ తర్వాత ఆమె కెరీర్ గ్రాఫ్ ఊహించినంత వేగంగా ముందుకెళ్లకపోయినా, ఫరియా మాత్రం తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది. మధ్యలో కొన్ని సినిమాలు చేసినా అవి పెద్దగా వర్కౌట్ కాలేదు. అయితే వెండితెరపై బ్రేక్ లేకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె యాక్టివిటీ ఎప్పుడూ తగ్గలేదు. గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో ఫ్యాన్స్‌కు దగ్గరగానే ఉంటూ తన పాపులారిటీని కంటిన్యూ చేస్తోంది. ఇప్పటికే తిరువీర్ హీరోగా నటిస్తున్న 'భగవంతుడు' సినిమా టీజర్ విడుదల కావడంతో ఫరియా మళ్లీ చర్చలోకి వచ్చింది. ఈ టీజర్‌లో ఆమె లుక్, పాత్ర డిజైన్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఒకవైపు సంప్రదాయ పల్లెటూరి అమ్మాయిలా లంగా ఓణీలో కనిపిస్తూనే, మరోవైపు కథ డిమాండ్ మేరకు బోల్డ్ షేడ్స్ ఉన్న సీన్స్‌లోనూ ఆమె కనిపించడం హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్, లిప్‌లాక్ షాట్, చివర్లో రౌడీలకు ఎదురెళ్లే ధీటైన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే, ఫరియాను ఇప్పటివరకు చూసిన ఇమేజ్‌కు పూర్తిగా భిన్నంగా చూపించారని చెప్పొచ్చు.కంటెంట్ బలంగా ఉంటే గ్లామర్ రోల్స్ చేయడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫరియా ఇప్పటికే పలుమార్లు చెప్పింది. అదే మాటకు తగ్గట్టుగానే రూరల్ డ్రామాలో ఆమె పాత్రను డిజైన్ చేసినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. గ్లామర్‌ను మాత్రమే కాకుండా, ఎమోషన్, ఆగ్రహం, అమాయకత్వం అన్నీ కలిపిన పాత్రగా ఇది కనిపిస్తోంది. ఈ సినిమాలో ఆమెకు నటన పరంగా కూడా మంచి స్కోప్ ఉన్నట్టు టీజర్ స్పష్టంగా చెబుతోంది. ఒకవైపు ప్లలెటూరి అమ్మాయి అమాయకత్వం, మరోవైపు ధైర్యంగా నిలబడే మహిళగా ఆమె చూపించబోయే షేడ్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి.జీజీ విహారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాతో ఫరియా మళ్లీ ఫామ్‌లోకి వస్తుందా లేదా అన్నది చూడాలి.

# నా రాజకీయ ప్రవేశం ప్రభావం పడుతుందనుకున్నా


### జన నాయగన్ విడుదలపై నటుడు విజయ్



విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' చిత్రం వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దర్శక నిర్మాతలు దీనిపై స్పందించగా.. తాజాగా విజయ్ ఈ విషయంపై మాట్లాడారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'జన నాయగన్'కు ఇలా జరగడం చాలా బాధగా ఉందన్నారు. నా నిర్మాతల గురించి నాకు బాధగా ఉంది. నేను రాజకీయాల్లోకి రావడం వల్లే నా సినిమాకు ఇలా చేస్తున్నారు. నా కారణంగా నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారు. రాజకీయరంగంలోకి రాకముందే వీటన్నిటికీ సిద్ధమయ్యాను. నా సినిమాపై ఈ ప్రభావం పడుతుందని ముందే ఊహించాను' అని తెలిపారు. ఈ సినిమా నిర్మాత వెంకట్ కె.నారాయణ కూడా దీని విడుదల ఆలస్యం కావడంపై ఇటీవల బాధపడ్డారు. దశాబ్దాల పాటు అభిమానులను అలరించిన విజయ్‌కు సినిమాల నుంచి మంచి వీడ్కోలు దక్కాలని ఆయన ఆకాంక్షించినట్లు చెప్పారు. కానీ, పరిస్థితి తమ చేయి దాటిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సెన్సార్ సమస్య వల్ల ఈనెల 9న విడుదల కావాల్సిన 'జన నాయగన్' వాయిదా పడింది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు అదే తేదీన మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై న్యాయస్థానం తాత్కాలిక స్టే విధించగా.. నిర్మాణసంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సినిమా విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌నే ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. ఈనెల 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది.

## చిత్రపరిశ్రమలో సెక్స్ వేధింపులు

### తమ్మారెడ్డి వ్యాఖ్యలతో కుదుపు



చిత్రసీమలో మరోమారు క్యాసింగ్ కౌచ్ దుమారం రేపుతోంది. తాజగా నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేసిన వ్యాఖ్యలు ఒక్కరిగా చిత్ర పరిశ్రమను కుదిపేశాయి. క్యాస్టింగ్ కౌచ్ లేదని చిరంజీవి అనగనే, గాయని చిన్మయి ఉందనేశారు. 'కాస్టింగ్ కౌచ్' లేదని మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై సీనియర్ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో వేధింపులు లేవని కొట్టిపారేయలే మని ఆయన స్పష్టం చేశారు. అంతే కాదు ఒకప్పుడు జమిందా రులు, రాజులు కేవలం అమ్మాయిలను అనుభవించడానికే సిని మాలు తీసేవారని, ఆ పరిస్థితి ఇప్పటికీ కొందరిలో కొనసాగు తోందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం ఏడాదికి 200 సినిమాలు వస్తున్నాయని, అందులో కొందరు ఎందుకు సినిమాలు తీస్తున్నారో వాళ్లకే తెలియదని.. కేవలం అమ్మాయిలను లోబర్చు కోవడానికే అలాంటి వారు ఇండస్ట్రీలోకి వస్తుంటారని తమ్మారెడ్డి విమర్శించారు. అయితే, సీరియస్‌గా సినిమాలు తీసే పెద్ద దర్శకు లు, నటులు వీటికి దూరంగా ఉంటారని ఆయన అభిప్రాయ పడ్డారు. గాయని చిన్మయి గురించి మాట్లాడుతూ.. ఆమె వేధింపులపై పోరాడితే నిషేధం విధించడం దారుణమని, ఆమెను చూసి మహిళలు స్ఫూర్తి పొందాలని సూచించారు. పరిశ్రమలో వేధింపులు ఉన్న మాట వాస్తవమే అని, కానీ టాలెంట్ ఉంటే ఎవరూ తొక్కలేరని ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా సమస్య వస్తే తాము అండగా ఉంటామని, అందరం కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు.




## మరోమారు జంటగా శివాజీ, లయ

### నేరుగా ఓటిటిలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'.

టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ చాలా కాలం తర్వాత జంటగా నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లకు రాకుండా నేరుగా డిజిటల్ వేదికగా విడుదలవుతోంది. అయితే ఈ సినిమా హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్ దక్కించుకోగా.. తాజాగా స్ట్రీమింగ్ వివరాలను వెల్లడించింది. ఈ సినిమాను ఫిబ్రవరి 12 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది.ఒకప్పుడు వెండితెరపై సూపర్ హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న శివాజీ, లయ కాంబినేషన్ అనగానే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. 'స్వయంవరం', 'టాటా బిర్లా మధ్యలో లైలా' వంటి చిత్రాల్లో వీరి కెమిస్ట్రీకి మంచి గుర్తింపు దక్కింది. ఇప్పుడు మళ్ళీ ఒక వెరైటీ టైటిల్‌తో, క్రైమ్ ఎలిమెంట్స్ కలిసిన కామెడీ ఎంటర్‌టైనర్‌తో వీరు రాబోతుండటం విశేషం. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని పెంచాయి.

## అమ్మానాన్నల విడాకులు పాఠం నేర్పాయి

### నటి శృతిహాసన్ భావోద్వేగం



కమల్ హాసన్ వారసురాలిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శృతి హాసన్, ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే, వెండితెరపై ఆమె గ్లామర్ వెనుక ఎంతో కష్టం.. భావోద్వేగమైన గతం ఉందని ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో బయటపెట్టారు. తన తల్లిదండ్రులు కమల్ హాసన్, సారిక విడిపోవడం తన జీవితాన్ని ఎలా మార్చేసిందో శృతి వివరించారు. తల్లిదండ్రుల విడాకుల తర్వాత తన జీవితం ఒక్కసారిగా తలకిందులైందని శృతి చెప్పారు. 'చెన్నైలో మెర్సిడెస్ బెంజ్ కార్లలో తిరిగిన నేను, అమ్మతో కలిసి ముంబై వచ్చాక లోకల్ ట్రైన్లలో ప్రయాణించాల్సి వచ్చింది. లగ్జరీ జీవితాన్ని, అలాగే కష్టాలను కూడా చూశాను' అని ఆమె తెలిపారు. అయితే, ఈ విడాకులు తనకు ఒక గొప్ప జీవిత పాఠాన్ని నేర్పాయని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒక స్త్రీ ఆర్థికంగా, మానసికంగా స్వతంత్రంగా ఉండటం ఎంత ముఖ్యమో తనకు అప్పుడే అర్థమైందని చెప్పుకొచ్చింది.. 'ఇద్దరు వ్యక్తులు కలిసి సంతోషంగా ఉండలేనప్పుడు, బలవంతంగా ఒకే ఇంట్లో ఉండి నరకం అనుభవించడం కంటే.. విడిపోయి విడిగా సంతోషంగా ఉండటమే మంచిది. అందుకే వారు విడిపోయినందుకు నేను ఒక రకంగా సంతోషించాను' అని శృతి హాసన్ కుండబద్దలు కొట్టారు. మొదట్లో 'ఐరన్ లెగ్' అని విమర్శలు ఎదుర్కొన్నా, తన కష్టంతో నేడు దేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకునే నటీమణుల్లో ఒకరిగా నిలవడం విశేషం. ప్రజంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.